నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, సోమవారం 29 జూలై 2024 | BHADRADRI KOTHAGUDEM


తాలిపేరు 25 గేట్ల ద్వారా విడుదలవుతున్న వరద నీరు


పర్ణశాల వద్ద తగ్గుతున్న గోదావరి

# గోదావరి తగ్గుముఖం

- భద్రాచలం వద్ద 47 అడుగుల ప్రవాహం..
- నేటికి ఇంకొంత తగ్గే చాన్స్
- 'తాలిపేరు'కు తగ్గిన ఉధృతి.. 26,986 క్యూసెక్కులు దిగువకు..
- ఇంకా వరద నీటిలోనే 'సున్నంబట్టి, పైడిగూడెం, గౌరారం' రహదారులు
- బురద తగ్గకపోవడంతో పునరావాస కేంద్రాల్లోనే ముంపు బాధితులు


భద్రాచలం వద్ద ప్రవహిస్తున్న గోదావరి నది

భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ/ భద్రాచలం/ బూర్గంపహాడ్/ పర్ణశాల/ చర్ల/ పాల్వంచ రూరల్, జూలై 28: భద్రాచలం వద్ద గోదావరి తగ్గుముఖం పట్టింది. ఆదివారం ఉదయం 6 గంటలకు 53 అడుగులుగా ఉన్న వరద ప్రవాహం.. మధ్యాహ్నం 2 రెండు గంటలకు మూడు అడుగులు తగ్గి 50 అడుగులకు చేరుకుంది. రాత్రికి మరో రెండు అడుగులు తగ్గి 47.90 అడుగుల వద్ద కొనసాగుతోంది. సోమవారం ఉదయానికి మరికొంత తగ్గే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. అయితే, 48 అడుగుల దిగువకు రావడంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. ఎగువన చర్ల, దుమ్ముగూడెం మండలాల్లోని గోదావరి పరీవాహక ప్రాంతాల్లో కొన్ని గ్రామాలు జల దిగ్బంధంలోనే ఉన్నాయి. మరికొన్ని రహదారులపై ఉన్న వరద నీరు ఇంకా తగ్గలేదు.

## పెరుగుతూ.. తగ్గుతూ..

ఎనిమిది రోజులుగా గోదావరి వరద పెరుగుతూ, తగ్గుతూ దోబూచులాడుతోంది. ఒకవేళ వరద మళ్లీ పెరుగుతుందేమోననే భయంతో ముంపు ప్రాంతాల ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. ఇప్పటికే నీట మునిగిన ప్రాంతాల్లో వరద వెనక్కి వెళ్లినప్పటికీ ఆ ప్రాంతాల్లో బురద అలాగే ఉంది. దీంతో అక్కడి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. శనివారం వరద పెరిగినందున ఆ రోజు సాయంత్రమే దాదాపు 39 కుటుంబాల వారిని అధికారులు భద్రాచలంలోని నన్నపునేని హైస్కూల్లో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రంలో ఉంచి సౌకర్యాలు కల్పించారు. కాగా, వరదల కారణంగా భద్రాచలం పుణ్యక్షేత్రానికి పది రోజులుగా భక్తుల సంఖ్య తగ్గింది. అయితే, దిగువన శబరి కూడా ఉప్పొంగడంతో ఏపీలో విలీనమైన కూనవరం మండలంలో ఉన్న వంతెన పైనుంచి ఆ నది ప్రవహిస్తోంది. ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే, దుమ్ముగూడెం మండలంలోని సున్నంబట్టి, పర్ణశాల, సంగం, గౌరారం, పైడిగూడెం గ్రామాలకు వెళ్లే రహదారులపై వరద నీరు అలాగే ఉండడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టుకు వరద ఉధృతి తగ్గింది. అధికారులు ఆదివారం 25 గేట్లు పూర్తిగా ఎత్తి 26,986 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. వర్షాల వల్ల 2400 క్యూసెక్కుల వరద నీరు కిన్నెరసానిలోకి చేరుతోంది. ప్రాజెక్టు నుంచి 5 వేల క్యూసెక్కుల నీటిని అధికారులు ఆదివారం రాత్రి విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 407 అడుగులు కాగా.. ప్రస్తుతం 402.8 అడుగులకు చేరింది.

## పునరావాస కేంద్రాల్లోనే ఉండాలి: పీవో

భద్రాచలం వద్ద గోదావరి వరద తీవ్రత తగ్గుముఖం పట్టినప్పటికీ అది పూర్తిగా తగ్గేంత వరకూ ముంపు బాధితులందరూ పునరావాస కేంద్రాల్లోనే ఉండాలని, ఆ మేరకు అధికారులకు చర్యలు తీసుకోవాలని భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ సూచించారు. భద్రాచలంలో వరద ముంపునకు గురైన కొత్త కాలనీ, విస్తా కాంప్లెక్స్ స్లూయిజ్‌లను ఆదివారం ఆయన పరిశీలించారు. స్లూయిజ్ నుంచి గోదావరిలోకి వరదనీరు పోయే మార్గాన్ని, కొత్తకాలనీ వద్ద ఉన్న బురద నీటిని పరిశీలించారు. ఇరిగేషన్, సీడబ్ల్యూసీ అధికారులు మోటర్ల ద్వారా వరద నీటిని ఎప్పటికప్పుడు గోదావరిలోకి వదలాలని సూచించారు. ఏఎస్పీ అంకిత్‌కుమార్, సీడబ్ల్యూసీ డీఈ మస్తాన్‌రావు, ఏఈ వెంకటేశ్వర్లు, పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## నల్లపోచమ్మ అమ్మవారికి 'వద్దిరాజు' పూజలు


ప్రత్యేక పూజల్లో అమ్మవారి బోనం ఎత్తుకున్న ఎంపీ వద్దిరాజు

బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర హైదరాబాద్ లాల్ దర్వాజా నల్లపోచమ్మ అమ్మవారిని ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. కాగా, ఎంపీ రవిచంద్రను లాల్ దర్వాజా బోనాల జాతర ఉత్సవ కమిటీ బాధ్యులు సత్కరించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. -ఖమ్మం, జూలై 28

# మెరుగైన వైద్య సేవలందించాలి

- వైద్యశాల పరిసరాలు నిత్యం పరిశుభ్రంగా ఉండాలి
- ఖమ్మం పెద్దాసుపత్రి పరిశీలనలో మంత్రి తుమ్మల
- 'నమస్తే తెలంగాణ' కథనం నేపథ్యంలో పర్యటన


ఆసుపత్రి ఆవరణను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మం సిటీ, జూలై 28: ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా ప్రధాన ఆసుపత్రి వైద్యులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఖమ్మం ప్రధాన వైద్యశాలను ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెద్దాసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు కంటుపడ్డాయని, ఆసుపత్రి పరిసరాలు దుర్గంధం వెదజల్లుతోందని వివరిస్తూ 'నమస్తే తెలంగాణ' ఇటీవల ఓ కథనాన్ని ప్రచురించిన విషయం విదితమే. ఈ విషయాన్ని తెలుసుకున్న మంత్రి తుమ్మల ఆదివారం ప్రధాన ఆసుపత్రిలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. అందుబాటులో ఉన్న మందుల వివరాలను తనిఖీ చేశారు. మాతా శిశు కేంద్రం వద్ద నిల్వ ఉన్న మురుగును వెంటనే తొలగించాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రోగుల పట్ల వైద్యులు సేవాభావంతో నడుచుకోవాలని సూచించారు. ఆసుపత్రి పరిసరాలు నిత్యం పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి మెడికల్ సూపరింటెంట్ డాక్టర్ బీ.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఆసుపత్రికి 600 బెడ్లు మంజూరైనప్పటికీ ప్రస్తుతం 450 బెడ్లే ఉన్నాయని, మిగిలిన వాటికి అనుమతులు ఇప్పించాలని కోరారు. కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్, కేఎంసీ కమిషనర్ అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి


కిష్టాపురం నుంచి తురకగూడెం రహదారి నిర్మాణం కోసం శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి, జూలై 28 : రాష్ట్రంలో పేదల అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తున్నదని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలో సుమారు రూ.2.5 కోట్ల ఖర్చుతో నిర్మించనున్న కిష్టాపురం– తురకగూడెం, తురకగూడెం– చిత లేతండా రహదారుల నిర్మాణాలకు, పాలేరులో సైడ్‌డ్రైన్ నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని రహదారులను నాణ్యతతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతు రుణమాఫీ విషయంలో విపక్షాల విమర్శలు అర్థంలేనివన్నారు. కూసుమంచిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో 37మందికి రూ.8.16 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నాగడ్ల నర్సింహారావు అనారోగ్యంతో మృతిచెందడంతో ఆదివారం జుజ్జుల్‌రావుపేటలోని ఆయన నివాసానికి వెళ్లి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, ఎంపీపీలు బానోత్ శ్రీనివాస్, బోడా మంగీలాల్, ఇతర నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# ఆ రహదారిలో ప్రయాణం.. నరకంతో సమానం..

- ప్రమాదకరంగా కొత్తగూడెం-ఇల్లెందు బైపాస్ రోడ్డు
- అడుగడుగునా భారీ గుంతలు.. వాటిల్లో వర్షపు నీళ్లు..
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న వాహనాల చోదకులు


గుంతల్లో వర్షపు నీరు నిండి ప్రమాదకరంగా మారిన కొత్తగూడెం - ఇల్లెందు బైపాస్ రోడ్డు





కొత్తగూడెం క్రైం, జూలై 28: 'వామ్మో.. ఆ రహదారిలో ప్రయాణించాలంటే నరకం కనిపిస్తోంది. తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లినా ఒళ్లు గుల్ల కావడం ఖాయం.' అంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు ప్రయాణికులు, వాహనదారులు. ప్రత్యక్ష నరకాన్ని తలపిస్తున్న ఈ మార్గం ఎక్కడో కాదు.. జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణంలోనే. అది కూడా జిల్లా కోర్టు మీదుగా పోలీస్ హెడ్‌క్వార్టర్స్ నుంచి ఇల్లెందుకు వెళ్లే మార్గంలోనే. కొత్తగూడెంలోని పోస్టాఫీస్ సెంటర్ నుంచి ఇల్లెందు వెళ్లే బైపాస్ (ఎల్‌ఐసీ ఆఫీస్) రోడ్డు సుమారు మూడు కిలోమీటర్ల మేర రోడ్డు గుంతలమయంగా ఉంది. ఈ మార్గంలో ప్రయాణించేందుకు పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగూడెం–ఇల్లెందు బైపాస్ రోడ్డులో వెళ్లాలని ఆలోచిస్తేనే నరకం కనిపిస్తోందని వాపోతున్నారు. ముఖ్యంగా మండల పరిషత్ కార్యాలయం నుంచి మొదలుకొని జిల్లా కోర్టుతోపాటు డీఎస్పీ కార్యాలయం, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ పాఠశాల, చర్చిలు, ఎల్‌ఐసీ ఆఫీస్, జడ్పీ కార్యాలయం, ఆర్‌అండ్‌బీ కార్యాలయం, సింగరేణి సెంట్రల్ వర్క్‌షాపు, ఈద్గా, శేషగిరినగర్ కాలనీ మీదుగా జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు వెళ్లే కీలకమైన ఈ రహదారిలో భారీ గుంతలు ఏర్పడి నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇల్లెందుకు వెళ్లాల్సిన భారీ వాహనాల (బొగ్గు టిప్పర్లు)ను పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా ఈ మార్గం ద్వారానే మళ్లిస్తున్నారు. దీంతో ఈ రహదారి నిత్యం రద్దీగా మారుతోంది. ఇప్పుడు వర్షాకాలం కారణంగా భారీ గుంతలు ఏర్పడి, వాటిల్లో నీళ్లు నిండి రహదారి కన్పించడం లేదు. దీంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి.

### ఈ రహదారి చాలా ఇబ్బందికరంగా ఉంది.



ప్రతి రోజు మా పిల్లలను స్కూలుకి తీసుకెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. ఈ రోడ్డు మొత్తం గుంతలతో నిండి ఉండడంతో బొగ్గు టిప్పర్లు వస్తున్న సమయంలో ప్రమాదకంగా ఉంటోంది. మా కాలనీ నుంచి చాలామంది చిన్న పిల్లలు ఇదే దారిలో ప్రతి రోజూ నడుచుకుంటూ, ఆటోల్లో స్కూళ్లకు వెళ్తుంటారు. ఎక్కడ ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంటోంది. –దాము, శేషగిరినగర్

### ఇటువైపు నుంచి వెళ్లాలంటే నరకమే..



నేను ప్రతి రోజూ నా బైక్ మీద ఇదే రోడ్డులో ఉద్యోగానికి వెళ్లి వస్తుంటాను. ఈ రోడ్డు పొడవునా నీళ్లు నిలిచిన భారీ గుంతలు ఉండడంతో రాకపోకలు సాగించాలంటే ప్రత్యక్ష నరకం కన్పిస్తోంది. ఈ రోడ్డుపై వెళ్లి వస్తున్నందున మా వాహనాలు దెబ్బతింటున్నాయి. –సొప్పరి ప్రశాంత్, వాహనదారుడు

### నడిచి వెళ్లాలన్నా భయంగానే ఉంటోంది..



వివిధ పనుల కోసం నేను తప్పనిసరిగా ఈ మార్గంలో ప్రయాణిస్తుంటాను. అయితే ఈ రోడ్డుపై గుంతలు, జరుగుతున్న ప్రమాదాలు చూస్తుంటే భయంగా అనిపిస్తోంది. అసలు ఈ రోడ్డు నరకంతో సమానంగా కన్పిస్తోందంటే అతిశయోక్తి కాదు. పెద్ద వాహనాలు కూడా ఇదే రోడ్డులో ప్రయాణిస్తుండడంతో ఎటు నుంచి ఏ ప్రమాదం పొంచి ఉంటుందో అని భయంగా ఉంటోంది. –సుమన్, కూలీలైన్

# రుణమాఫీపై రగడ

- భద్రాద్రి జడ్పీ సమావేశంలో వాడీవేడి చర్చ
- బీఆర్‌ఎస్, కాంగ్రెస్ సభ్యుల మధ్య వాదోపవాదాలు
- లెక్కలు చెప్పలేక దాటవేసిన అధికారులు
- సాంకేతిక లోపాలుంటే సరిచేస్తాం: కలెక్టర్ జితేశ్ వి పాటిల్



జడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని, చిత్రంలో కలెక్టర్ జితేశ్ వి పాటిల్, జడ్పీ చైర్మన్ కంచర్ల, ఎస్పీ రోహిత్‌రాజు, ఎమ్మెల్యేలు

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 28 (నమస్తే తెలంగాణ): ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు చేసిన రూ.లక్షలోపు రుణమాఫీపై భద్రాద్రి జడ్పీ సర్వసభ్య సమావేశంలో రగడ జరిగింది. జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖరరావు అధ్యక్షతన కొత్తగూడెం క్లబ్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో సభ్యులు రైతు రుణమాఫీపై లెక్కలు చెప్పాలని అధికారులను నిలదీశారు. రూ.లక్ష రుణం తీసుకున్న రైతులందరికీ రుణమాఫీ చేస్తానన్న కాంగ్రెస్ సర్కార్ తీరును ఎండగట్టారు. మణుగూరు, ఆళ్లపల్లి, గుండాల, లక్ష్మీదేవిపల్లి, చంద్రుగొండ, సుజాతనగర్, బూర్గంపాడు మండలాల్లో చాలామంది రైతులకు రుణమాఫీ చేయలేదని మండిపడ్డారు. రేషన్‌కార్డు పేరుతో కొర్రీలు పెట్టి జాబితాలో అర్హుల పేర్లు లేకుండా ఎలా చేశారంటూ ఆళ్లపల్లి ఎంపీపీ మంజుభార్గవి, మణుగూరు జడ్పీటీసీ పోశం నరసింహారావు అధికారులను ప్రశ్నించారు. దీనికి డీఏవో బాబూరావు వివరణ ఇచ్చేందుకు నీళ్లు నమలాల్సి వచ్చింది. ఆయన వద్ద లెక్కలు లేకపోవడంతో రుణమాఫీ అయిన మొత్తం లెక్క చెప్పారు తప్ప అసలు జిల్లావ్యాప్తంగా ఎంతమంది రైతులు రూ.లక్ష రుణం తీసుకున్నారు అనేది చెప్పలేకపోయారు. దీంతో సభ్యులు అసహనం వ్యక్తం చేశారు.

## జ్వరాలతో చనిపోతున్నా పట్టించుకోరా?

గ్రామాల్లో పారిశుధ్యం పడకేయడంతో జనం జ్వరాల బారినపడి చనిపోతున్నా పట్టించుకోరా? అని బీఆర్‌ఎస్ సభ్యులు అధికారులను ప్రశ్నించారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కరెంటు సమస్య రోగులను వేధిస్తున్నదని, మైలారంలో జ్వరాలతో ఇటీవల 8 మంది చనిపోయినా వైద్యశాఖ ఏం చేస్తున్నట్లు అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆయా సభ్యులు తమ మండలాల్లోని సమస్యలను సమావేశం దృష్టికి తెచ్చి అధికారులను ప్రశ్నించారు. రుణమాఫీ, పారిశుధ్య సమస్య, జ్వరాల విజృంభణపై సభ్యుల ప్రశ్నలతో సమావేశం వాడీవేడిగా సాగింది.

## సాంకేతిక లోపాలు ఉంటే సరిచేస్తాం: కలెక్టర్

కలెక్టర్ జితేశ్ మాట్లాడుతూ రుణమాఫీ విషయంలో సాంకేతిక లోపాలు ఉంటే సవరిస్తామని అన్నారు. అర్హులైన వారిని గుర్తించి వారికి వర్తింపజేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కొత్తగూడెం, ఇల్లెందు, వైరా ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, కోరం కనకయ్య, రాందాస్‌నాయక్, ఎస్పీ రోహిత్‌రాజు, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాస్, సీఈవో చంద్రశేఖర్ అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

### రుణమాఫీపై క్లారిటీ లేదు..



రుణమాఫీపై అధికారుల నోరు విప్పడం లేదు. ఆళ్లపల్లి మండలంలో 1200 మంది రైతులకు రుణమాఫీ రాలేదు. పహాణీలపై గత ప్రభుత్వం రుణమాఫీ చేసింది. ఇప్పుడు ఈ ప్రభుత్వం చేయడం లేదు. సమాధానం చెప్పాలి. పోడు రైతులకూ అన్యాయం జరుగుతోంది. – మంజు భార్గవి, ఆళ్లపల్లి ఎంపీపీ

### చేతగాని హామీలు ఎందుకు..?



చేతకానప్పుడు రుణమాఫీపై కాంగ్రెస్ ఎందుకు హామీ ఇవ్వాలి. మణుగూరు మండలంలో వేల మందికి రుణమాఫీ కాలేదు. సొసైటీ కార్యాలయాలు చుట్టూ రోజూ రైతులు తిరుగుతున్నారు. వ్యవసాయ అధికారులు లెక్కలు లేకుండా మీటింగ్‌కు ఎందుకు వచ్చినట్లు? – పోశం నరసింహారావు, మణుగూరు జడ్పీటీసీ

# పంటలు పుష్కలంగా పండాలి.. గంగమ్మ తల్లీ..

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బోనాల వేడుకలు
- అమ్మవార్లకు ప్రీతిపాత్ర నైవేద్యాల సమర్పణ


బోనాలు ఎత్తుకున్న మహిళలు


అశ్వారావుపేట రూరల్: ఆసుపాక గ్రామంలో బోనాలతో మహిళలు

*వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడి పంటలు పుష్కలంగా సమకూరాలని ఆయా గ్రామాల ప్రజలు వేడుకున్నారు. బోనాల పండుగ సందర్భంగా ఉమ్మడి వ్యాప్తంగా ఆయా గ్రామాల ప్రజలు ఆదివారం అమ్మవార్లకు బోనాలు, నైవేద్యాలు సమర్పించారు. తమ పాడి సంపదపైనా, పిల్లాపాపలపైనా అమ్మవార్ల ఆశీస్సులు ఉండాలని, సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించేలా దీవించాలని మొక్కుకున్నారు. మహిళలందరూ సంప్రదాయం ప్రకారం ఉదయాన్నే ప్రత్యేక బోనాలు తయారు చేసుకున్నారు. వాటిని తలపై పెట్టుకొని ప్రతి ఇంటి నుంచీ బయలు దేరారు. గ్రామాల్లోని గంగమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్ల ఆలయాలకు చేరుకొని ఆనవాయితీ ప్రకారం నైవేద్యాలు సమర్పించారు. ఆటాపాటలు, డప్పుచప్పుళ్లతో వెళ్లి అమ్మవార్ల దీవెనలు అందుకున్నారు.* -నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, జూలై 28


కొత్తగూడెం అర్బన్: అమ్మవారి వద్దకు బోనాలతో వెళ్తున్న మహిళలు